



ఒక్కరోజే రూ.81.54 లక్షల ఆదాయం

భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం

6





ఫ్రీ.. రష్!

ఉచిత బస్సు 'స్త్రీశక్తి' ఏమిటో తెలిపే దృశ్యమిది. శనివారం రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళా ప్రయాణికులను చూసి అందరూ నోరెళ్లబెట్టారు. రెండవ శనివారం సెలవురోజు కావడంతో వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. అందులోనూ ఉచిత ప్రయాణం కావడంతో మహిళా ప్రయాణికులు ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయిందిలా. - రావులపాలెం



కొత్త ఎస్పీ మీనా

కోనసీమ జిల్లా ఎస్పీగా రాహుల్ మీనా

- పల్నాడు జిల్లాకు ఎస్పీ కృష్ణారావు బదిలీ
- 15 నెలల వ్యవధిలోనే ఎస్పీ బదిలీ



ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్త ఎస్పీగా రాహుల్ మీనాను ప్రభుత్వం నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న మీనా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 2019 ఐపీఎస్ ఏపీ బ్యాచ్‌కు చెందిన అధికారి. అయితే లాఅండ్‌ఆర్డర్ విభాగంలో రాహుల్ మీనాను తొలిసారిగా కోనసీమ జిల్లా ఎస్పీగా నియమించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన బి.కృష్ణారావును పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణారావు 2024 జూలై 17న కోనసీమ జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించి సుమారు 15 నెలలపాటు విధుల్లో కొనసాగారు. అయితే ఆయనను ఆకస్మికంగా బదిలీ చేయడం జిల్లా పోలీసు యంత్రాంగంలో చర్చనీయాంశమైంది. 2022 ఏప్రిల్ 4న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటికి ప్రస్తుత బదిలీ అయిన కృష్ణారావు సహా నలుగురు ఎస్పీలు బాధ్యతలు నిర్వహించారు. ఐదో ఎస్పీగా కోనసీమ జిల్లాకు రాహుల్ మీనా రానున్నారు. మూడు, నాలుగు రోజుల్లో మీనా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారని సమాచారం. అయితే ఇటీవల ప్రభుత్వం కూడా జిల్లా అధికారుల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణలో భాగంగా కీలక అధికారుల బదిలీలు అనివార్యమవుతున్నాయి.

రావులపాలెంనకు చెందిన అబ్బాయికి నల్లజర్లకు చెందిన యువతితో పెళ్లి చూపులు జరిగాయి.. ఒకరికొకరు నచ్చారు.. కట్నం రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఓకే అనుకున్నారు.. మరి బంగారం ఏం పెడతారని ఇరు తరఫు బంధువులు రంగంలోకి దిగారు. అమ్మాయికి 3 కాసులు పెడతామని వధువు తరపువారు చెప్పారు.. 3 కాసులకు ఏం వస్తుంది.. 10 కాసులు పెట్టాలని డిమాండ్ చేశారు. 10 కాసుల బంగా రానికి 10 లక్షలు అవుతుందని అంత పెట్టలేమని 3 కాసులే పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. మళ్లీ కబురుపెడతామంటూ వరుడి తరపు వారు వచ్చేశారు..

పిఠాపురానికి చెందిన యువతీయువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇద్దరు దగ్గర బంధువులే కావడంతో వివాహం నిశ్చయించారు. అయినప్పటికి బంగారం ఎంత పెట్టాలనే విషయంలో మాత్రం ఎవరు వెనక్కి తగ్గలేదు. మాకు కట్నం ఎంతిచ్చినా పర్వాలేదు. బంగారం మాత్రం మేము అడిగినంత పెట్టాల్సిందే అంటూ పట్టుబట్టారు. పెళ్లికూతురికి అమ్మాయి తరపు వారు 20 కాసులు, పెళ్లి కొడుకు తరపు 10 కాసుల బంగారు ఆభరణాలు పెట్టేలా ఒప్పందం కుదిరింది. పెళ్లికొడుక్కి ఐదు కాసులు పెట్టాలని షరతు పెట్టారు. బంగారం విషయంలో అంగీకారానికి వచ్చి కట్నం మాత్రం అమ్మాయి తరపు వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన అమ్మాయికి పాలకొల్లుకు చెందిన అబ్బాయితో పెళ్లి మాటలు జరిగాయి.. వరుడు తరపు వాళ్లు బంగారం ఎంత పెడతారని వధువు తరపు వారిని అడిగారు.. 10 కాసులు పెడతామని చెప్పారు.. మీరెంత పెడతారని వరుడు తరపు వారిని అడిగితే 8 కాసులు అన్నారు.. ఇరు పక్షాల వారు 18 కాసులు వధువుకి పెట్టేలా అంగీకరించారు. అయితే వరుడికి 5 కాసులు బంగారం అడిగారు. అంత పెట్టలేమని 3 కాసులు పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. 2 కాసులు పెట్టకపోతే సంబంధం వదిలేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి వధువు తరపు వారు తగ్గి 5 కాసులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడంతో పెళ్లి ఓకే అయ్యింది..

ఆదివారం ప్రత్యేకం

కనకప్పు..సింహాసనం!

పుత్తడిబొమ్మ.. అందనిదమ్మా..



(కాకినాడ/రాజమహేంద్రవరం/మండపేట /పిఠాపురం,ఆంధ్రజ్యోతి)

పెళ్లంటే..

పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు..తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. ఇదంతా ఒకప్పుడు.. ఈ కాలంలో పెళ్లంటే.. కాసులు.. గ్రాములు.. కిలోలు..అంటే బంగారం ఎన్ని కాసులు పెడతారు దగ్గర ఆరంభమై ఎన్ని కిలోల వెండి పెడతారు దగ్గర కథ ముగిస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం బంగారం 10 గ్రాములు అక్షరాలా రూ.లక్ష దాటేసింది.. 10 కాసులు బంగారం పెట్టాలంటే రూ.10 లక్షలే.. బంగారం రాకెట్ వేగంతో పరుగులు తీస్తోన్న తరుణంలో వివాహాల్లో బంగారం పెట్టి పోతలు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లి ఖర్చును మించి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ.. అందరికీ అందకుండా పోయింది.

ఇంట్లో చిన్న వేడుకైనా పిసరంతైనా పసిడి కొనితీరాల్సిందే. పెద్ద పండుగలకు, వివాహాలకు బంగారం లేని వేడుకను ఊహించడం కష్టం. అంతలా మన జీవితాల్లో సువర్ణం ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కొంది. ఎంత పేద వారి పెళ్లయినా కనీసం 10 గ్రాముల బంగారం కొలువుదీరాల్సిందే. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు బంగారం కంటే ఎక్కువగా మెరుస్తున్నాయి.
ఒకవైపు ఈనెల 23 నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. బంగారం ధర గారం చేస్తూ దిగిరానంటోంది. దీంతో ఇంట్లో పెద్ద వాళ్లకు పెళ్లి తంతు, ఖర్చు కంటే పసిడి చింత ఎక్కువైపోయింది. పందిట్లో పడతుల ఒంటిపై పసిడి మెరుపు లొలుకుతూ ఉంటే ఆ కళే వేరు కదా మరి!

కనకం.. చదివింపుల్లేవ్..

కొంతకాలం కిందట వేడుకల్లో బంగారం చదివించే వారు.. పెరిగిన ధరలతో ఇవన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం నగదు చదివింపులతో సరిపెట్టేస్తున్నారు.. ప్రస్తుతం ఆభరణాల చదివింపులు మాయమైపోతున్నాయి.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు పెళ్లి కోసం మూడు నాలుగు తులాల బంగారం కొనుగోలు చేసేవారు ఇప్పుడు ధర పెరగడంతో సగం అంటే రెండు తులాలకు పరిమితమవుతున్నారు. వెండి ధర భారీగా పెరగడంతో అటు వైపు సామాన్యులెవరు వెళ్లడం లేదు.కేవలం కాళ్లకు పట్టీలు, తప్ప వెండివైపు చూడడం లేదు.

- రికార్డు స్థాయిలో బంగారం ధరలు
- పెళ్లింట పెట్టలేక సతమతం
- చదివింపుల్లోనూ కనుమరుగు
- సామాన్య,మధ్యతరగతికి భారం
- కొనుగోళ్లకు దూరంగా జనం
- ఏడాదిలో రూ.50 వేల వరకూ తేడా



కొనగలమా!

బంగారం ధర అడ్డుఅదుపు లేకుండా పరుగులు తీస్తోంది. రికార్డు స్థాయిలో అందనంతగా పెరిగిపోతోంది.ఒక్క ఏడాది ధరలు డబులు పెరిగాయి. గతేడాది ఇదే సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69 వేలు ఉండగా ప్రస్తుతం రూ.1,11,160లు ఉంది. 22 క్యారెట్లు 101900 ఉంది.గతేడాది కిలో వెండి రూ.50 వేల వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.1,31,600 ఉంది.

బంగారంలా!

వేడుకల్లో వధూవరుల అలంకారంలో కాకి బంగారాన్ని ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అంటే నాణ్యత తక్కువ కలిగిన లేదా బంగారం మాదిరిగా కనబడే లోహాలతో ఆభరణాలు ఉంటున్నాయి. వేడుకలకు వచ్చే మహిళలు ఎక్కువ శాతం రోల్డు గోల్డు, వన్ గ్రామ్ గోల్డు ఆభరణాలు ధరిస్తున్నారు.చెవిదిద్దుల నుంచీ వడ్డాణం వరకూ రోల్డు గోల్డు నగలు అందుబాటులో ఉండడంతో వాటినే ఎక్కువ శాతం వినియోగిస్తున్నారు.

పెళ్లింట..బంగారమే!



పసిడి ధర ఎంత పరుగులు తీసినా వధూవరుల కుటుంబాలకు మాత్రం కనకం భారం తప్పడం లేదు. ధర ఎంతకు ఎగబాకినా బంగారం పెట్టిపోతల్లో రాజీ పడడం లేదు. కట్నం అయినా తగ్గించండి కానీ మా అబ్బాయికి పెట్టే బంగారం పెట్టాల్సిందే అంటూ వరుడు కుటుం బం.. మా పాపకు మీరేం బంగారం పెడతారంటూ వధువు కుటుంబం ఎవరికివారు ఆభరణాల్లో రాజీపడడం లేదు. పేద కుటుంబాల్లో వివాహం సమయాల్లో అమ్మాయి తరఫున వధువుకు కాసు (8 గ్రాములు), మధ్యతరగతిలో 40 గ్రాములు, ఎగువ మధ్యతరగతి 250 గ్రాముల వరకు పెట్టిపోతలు పెడతారు. బడాబాబులు అయితే లెక్కేలేదు. ఇది కాకుండా వరుడికి మరికొంత చదివిస్తారు. ఇప్పుడు ధర ఎంత పెరిగినా పెట్టిపోతలు మాత్రం మారలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివాహాల్లో వధూవరుల కుటుంబాల్లో పెట్టిపోతలు నేటికీ కొనసాగుతున్నాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే వివాహాల్లో మాత్రం బంగారం పెట్టిపోతల్లో కోతలు వేయకుండా కట్నంలో కొంత తగ్గించుకుంటూ శుభకార్యాలు జరుపుతున్నారు.

మత్తు వైద్యురాలు విధులకు గైర్హాజరుపై విచారణ

- ఉన్నతాధికారులకు రెండుసార్లు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- వివరాలు సేకరించిన విచారణ అధికారి డాక్టర్ ప్రవీణ్
- డీసీహెచ్ఎస్ నివేదిక అందిస్తామని వెల్లడి



పి.గన్నవరం సిహెచ్‌సీలో ఆసుపత్రిలో హెడ్‌నర్సు జి.రాజేశ్వరిని విచారణ చేస్తున్న విచారణాధికారి డాక్టర్ ప్రవీణ్

పి.గన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీలో మత్తు వైద్యురాలుగా కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిమాధురి తరుచూ విధులకు గైర్హాజరు కావడంతోపాటు సమయానికి రావడం లేదన్న ఆరోపణలు, ఫిర్యాదులపై శనివారం విచారణాధికారి డాక్టర్ ఎస్.ప్రవీణ్ విచారణ చేపట్టారు. అత్యవసర సేవల్లో మత్తు వైద్యురాలు అందుబాటులో ఉండరని, సమయానికి విధులకు హాజరుకారని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండరని స్థానికులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో డైరెక్టర్ సెకండరీ హెల్త్ అధికారులతోపాటు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. అలాగే మత్తు వైద్యురాలు విధుల్లో అలసత్వంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్ కూడా షోకాజ్ నోటీసులు అందించారు. వాటికి కూడా ఆమె సమాధానం చెప్పలేదని అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో సంబంధిత వైద్యురాలిపై విచారణ నిర్వహించాలని డైరెక్టర్ సెకండరీ హెల్త్ అధికారులు రామచంద్రపురం సీహెచ్‌సీ సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ సంద ర్భంగా శనివారం వైద్యులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించడం జరిగిందని డాక్టర్ ప్రవీణ్ చెప్పారు. అలాగే స్థానిక రాజకీయ నాయకులు, స్థానిక ప్రజానీకం నుంచి వివరాలు సేకరించడంతోపాటు లిఖిత పూర్వకంగా సమస్యలను తీసుకోవడం జరిగిందన్నారు. తదుపరి చర్యలు కోసం తదుపరి నివేదికను కొవ్వూరు డీసీహెచ్ఎస్‌కు అందించడం జరుగుతుందని చెప్పారు.

ఉపాధి కల్పించే స్థాయికి..



- పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా సంఘాల నుంచి మహిళల ఎంపిక
- ఈనెల 15 నుంచి డీఆర్డీఏ ద్వారా అర్హుల సర్వే
- మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలనే లక్ష్యం
- మహిళా దినోత్సవం నాటికి పారిశ్రామికవేత్తలుగా మహిళలు
- ఆసక్తి కనబరుస్తున్న డ్వాక్రా మహిళలు


(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడంతోపాటు మహిళల ఆర్థిక స్వావలంబన కలిగించే దిశగా టీడీపీకి చెందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చేయడంతోపాటు వారు ఏర్పాటుచేసే పరిశ్రమల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే మహిళా దినోత్సవం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా ఈనెల 15 నుంచి రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే నిర్వహించి అర్హత కలిగిన మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించనున్నారు. ప్రభుత్వం వ్యాపారం నిమిత్తం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థిక చేయూతనిచ్చే కార్యక్రమంలో రుణం పొందాలంటే కనీసం ఒకరికి ఉపాధి కల్పించాలనే నిబంధనల తప్పనిసరి చేయనున్నారు. డీఆర్డీఏ ద్వారా స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా మహిళలకు అదనపు రుణాలను మంజూరు చేయనున్నారు. రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా శక్తివంతులుగా చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పీ-4 పథకంలో భాగంగా గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను ఎంపికచేసి వారికి స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో చేయూతను ఎలా ఇస్తున్నారో అదే రీతిన ప్రతీ కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలనే ఆశయంతో కార్యక్రమం చేపట్టారు. వచ్చే మహిళా దినోత్సవం నాటికి లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా ఎంపికచేసి వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఈనెల 15 నుంచి డీఆర్డీఏ క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే ప్రారంభించనుంది. అధికారులు నేరుగా మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, పరిశ్రమల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారు. రానున్న రోజుల్లో వారే ఎలాంటి వ్యాపారం చేయాలనుకున్నారో, పొందుతున్న ఆదాయం ఎంత, ఎంతమందికి ఉపాధి కల్పిస్తారు అనే అంశాలకు సంబంధించి సమాచారం సేకరించి వాటి ఆధారంగా యూనిట్లను మంజూరు చేయడంతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్, ఎంటర్‌ప్రైజెస్, జీవనోపాధులు అనే మూడు విభాగాలుగా వర్గీకరించి వారి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ సర్వేలో గుర్తించిన అర్హులైన మహిళలను ఎంపికచేసి వారికి ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందించడంతోపాటు బ్యాంకుల ద్వారా కనిష్ఠంగా రూ.10 వేల నుంచి గరిష్ఠంగా రూ.2లక్షలకు రుణం మంజూరుచేయనున్నారు. అలాగే స్త్రీనిధి పథకం ద్వారా రూ.లక్ష వరకు ఎస్సీ, ఎస్టీ ఉన్నతి పథకం కింద రూ.2లక్షల నుంచి అవసరాన్ని బట్టి రూ.10లక్షల వరకు కూడా రుణాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అయితే యూనిట్ విస్తరణ, రుణాలు పొందాలంటే దాని ద్వారా మరికొందరికి ఉపాధి కల్పించాలనే నిబంధనను ఖచ్చితంగా పాటించాలి. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళల ద్వారా డెయిరీ, పచ్చళ్లు, ఆహార శుద్ధి, కలంకారీ, పేపరు ప్లేట్లు వంటి చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పడంతోపాటు యూనిట్ల వివరాల ఫొటోలను ప్రత్యేక యాప్‌లో నమోదుచేసి పారదర్శకంగా ఈ పథకాన్ని నిర్వహించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న యోచనకు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సహకరిస్తే రానున్న రోజుల్లో వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్టే.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సఖినేటిపల్లి రేవులో అదుపు తప్పిన పంటు.. ఒడ్డుకు చేర్చిన డ్రైవర్

7



కుటుంబ సభ్యుల వివరాలు

02	[illegible]	01-11-1997/27	[illegible]	[illegible]
03	[illegible]	15-08-1971/53	[illegible]	[illegible]

అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరుతో ముద్రితమైన ఓ లబ్ధిదారుని రేషన్ కార్డు

ఆధార్ వల్లే స్మార్ట్ రేషన్‌కార్డుల్లో జిల్లా పేరు తప్పిదం

- ఎడిట్ ఆప్షన్ వచ్చిన వెంటనే సచివాలయాల్లో మార్చుకోవచ్చు
- జిల్లాలో లక్ష వరకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ
- జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలకు చెక్ పెట్టే లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీతో కూడిన స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, ఇప్పటివరకు జిల్లాలో సుమారు లక్ష కార్డుల పంపిణీ పూర్తి అయినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అయితే స్మార్ట్ రేషన్‌కార్డుల ముద్రణలో తలెత్తిన లోపాలను దృష్టిలో పెట్టుకుని స్వల్ప మార్పులు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పేరు కార్డులో ముద్రితమైందని, దీనికి కారణం ఆధార్ కార్డు డేటా ప్రకారమే ఈ కార్డుల ముద్రణ జరిగిందని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వ పథకాలు యథావిధిగా ఎటువంటి అభ్యంతరాలకు తావు లేకుండా అందుతాయని జేసీ తెలిపారు. స్మార్ట్ కార్డులు ఆధార్‌లో ఉన్న డేటా ఆధారంగా ముద్రించడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని, విభజన జరిగిన జిల్లాల్లో ఈ తరహా పొరపాటు జరిగాయని ఆమె తెలిపారు. అంతే తప్ప ఉద్దేశపూర్వకంగా మన జిల్లాలో మాత్రమే ఈ విధంగా జరగలేదని, కేవలం సాంకేతికంగా జరిగిన పొరపాటుగా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లో త్వరలో చేర్పులు, మార్పుల కోసం ఎడిట్ ఆప్షన్ వస్తుందని, అప్పుడు ఈ కార్డుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని జేసీ తెలిపారు. జిల్లా పేరు మార్పు కోరుకునేవారు తమ దగ్గరలో ఉన్న సచివాలయాల్లో సంప్రదిస్తే మార్పులు చేయడం జరుగుతుందని, దయచేసి ఎవరూ ఎటువంటి ఆందోళనలు చెందవద్దని, వదంతులను వ్యాప్తి చేయవద్దని జేసీ విజ్ఞప్తి చేశారు.



సెల్‌ఫోన్లకు బందీలయ్యారా..!

● శారీరక, మానసిక సమస్యలు తప్పవు ● మానవ సంబంధాలపై సెల్‌ఫోన్ ప్రభావం..

బూచాడమ్మా బూచాడు బుల్లి పెట్టెలో ఉన్నాడు.. కళ్లకెప్పుడు కనబడడు కబురులెన్నో చెబుతాడు అంటూ మనసు కవి ఆచార్య ఆత్రేయ 55 ఏళ్ల క్రితమే ఫోన్ గురించి మహా గొప్పగా వివరించారు. ఆ ఫోన్లు రూపాంతరం చెందాయి. సెల్‌ఫోన్‌తోనే మనిషి మనుగడ ముడిపడి పోయింది. సెల్‌ఫోన్ లేని జీవితాన్ని ఏ మనిషి ఊహించుకోలేని పరిస్థితి. కులమతాలకు అతీతంగా, ధనిక పేద తారతమ్యం లేకుండా అందరినీ అరచేతిలో బంధించేసింది. సెల్‌ఫోన్‌ను ఎంతవరకు ఎప్పుడు ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకునే వారిని వేళ్ల మీద లెక్కించవచ్చు. కానీ 80 శాతం మంది సెల్‌ఫోన్ బంధిఖానాలో చిక్కుకున్నవారే. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్‌కు బంధీలే. అటువంటి సెల్‌ఫోన్‌తోనే గంటల తరబడి గడుపుతున్నారా. మరి సెల్‌ఫోన్ స్ర్కీన్‌టైమ్ పెరిగితే అనర్థమే అన్న విషయాన్ని మరిచిపోతున్నారు.

శారీరక మానసిక సమస్యలు తప్పవు..

అమలాపురంరూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు క్రీడల పట్ల కంటే సెల్‌ఫోన్ వినియోగంతోనే కాలం గడిపేస్తున్నారు. ప్రతీ ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కో ఫోన్ విధానంతో కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతోపాటు శారీరక మానసిక సమస్యల బారిన పడుతున్నవారు ఎందరో ఉన్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక అదే ఫోన్‌తో రీల్స్ చేసి డబ్బులు సంపాదించేవారు ఉన్నారు. సర్వం సెల్‌ఫోన్ మయంగా మారిపోవడంతో భవిష్యత్ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో అన్న ఆందోళన కూడా ఉంది.

సెల్‌ఫోన్‌తో అనారోగ్య సమస్యలు..

రోజులో ఎక్కువ గంటలు ఫోన్ చూసినా లేక ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడే వారిపై రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.



దీనివల్ల కొందరికి బ్రెయిన్ ట్యూమర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించే వారిలో సంతాన సాఫల్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కొందరిలో వీర్య కణాల ఉత్పత్తి తగ్గడం, లైంగిక సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మానసిక సమస్యలు ఇలా..

సెల్‌ఫోన్ ఎక్కువగా చూసే వారిలో బ్లూ లైట్ కంటి మీద పడి బ్రెయిన్‌లోని మెలటోనిన్ దెబ్బ తింటుంది. దీంతో స్లీప్ సైకిల్ అన్ బ్యాలెన్స్ అవ్వడంతో నిద్ర పట్టకపోవడం, మధ్య రాత్రిలో మెలుకువ వచ్చేస్తోంది. ఇలాంటి వారిలో కోపం, చిరాకు, అసహనం పెరుగుతోంది. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, చదివింది గుర్తుకు రాకపోవడం జరుగుతోంది. దానివల్ల చదువు దెబ్బతింటుంది. ఇక ఉద్యోగులైతే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, కింది స్థాయి సిబ్బందితో అనవసర వాదులాటలకు దిగడం, ప్రవర్తనలో మార్పుతో పాటు కోపం విపరీతంగా పెరిగిపోతుంది. మానసిక సమస్యల్లో భాగంగా కొందరిలో ఆకలి దెబ్బతింటుంది. ఏమీ తినకపోవడంతో పోషకాహారం లోపించి మనిషి ఎదుగుదలపై ప్రభావం చూపిస్తోంది.

సెల్‌తో మానసిక ఒత్తిళ్లు

-డాక్టర్ పి.సౌమ్య, మానిసిక వైద్య నిపుణురాలు, అమలాపురం



సెల్‌ఫోన్ ఎక్కువగా చూసేవారు, మాట్లాడేవారిలో మానసిక ఒత్తిళ్లు పెరుగుతాయి. స్ర్టెస్, యాంగ్జయిటీ కారణంగా నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. రేడియేషన్ ప్రభావంతో నరాల సమతుల్యత దెబ్బతింటుంది. ఏకగ్రత తగ్గి, జ్ఞాపకశక్తి అంతకంతకు నశిస్తోం ది. రేడియేషన్ ప్రభావంతో ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయి.

రేపు వికాస జాబ్ మేళా

కాకినాడసిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 35సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 77993 76222లో సంప్రదించాలన్నారు.

చర్లపల్లి-అనకాపల్లి మధ్య 8 ప్రత్యేక రైళ్లు



సామర్లకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-అనకాపల్లి మధ్య సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లను శనివారం నుంచి నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ తెలిపారు. 07035 నంబరుగల చర్లపల్లి-అనకాపల్లి ప్రత్యేక రైలు సెప్టెంబరు 13, 20, 27 అక్టోబరు 4వరకూ ప్రతీ శని వారం చొప్పున నాలుగు ట్రిప్‌లుగా నడుస్తోం ది. 07036 నంబరుగల అనకాపల్లి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు సెప్టెంబరు 14, 21, 28 అక్టోబరు 5 వరకూ ప్రతీ ఆదివారం చొప్పున నాలుగు ట్రిప్‌లు నడుస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం. నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం ఆయా సమీప రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సీపీఆర్వో తెలిపారు.

కమ్ముకున్న మబ్బులు



తూర్పు కనుమల్లో కనువిందుచేస్తున్న మబ్బులు

కాకినాడ జిల్లా తునిలో శనివారం వేకువ జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్తంభించింది. మెట్టలో కురిసిన జోరువానకు తుని తూర్పు కనుమల్లో జాతీయ రహదారిపై కమ్ముకున్న మబ్బులు చూపరులను కనువిందు చేశాయి.

-తుని రూరల్(ఆంధ్రజ్యోతి)

ఊటీని తలపించేలా..



దేవీపట్నం మండలం నేలకోట గ్రామ సమీపంలో కొండలపై మంచుతెరల్లా మేఘాలు

శనివారం ఉదయం అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో నేలకోట గ్రామ సమీపంలో వర్షం కురిసిన అనంతరం ఊటీని తలపించేలా కొండలపై మేఘాలు తెల్లని మంచుతెరల్లా కమ్మాయి. దీంతో పర్యాటకులను ఆకట్టుకున్నాయి.

-దేవీపట్నం(ఆంధ్రజ్యోతి

ఆల్‌టైం రికార్డు

వర్జీనియా పొగాకు @430

● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



జంగారెడ్డిగూడెం కేంద్రం-32లో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలకు రెక్కలొచ్చాయి. మునుపెన్నడూ లేనివిధంగా కొయ్యలగూడెం వేలం కేంద్రంలో శనివారం కిలో క్వాలిటీ వర్జీనియా పొగాకు ధర రూ.430 పలికింది. ఇది ఎన్ఎల్ఎస్ చరిత్రలోనే రికార్డు ధర. గత ఏడాది కిలోపొగాకుకు అధిక ధర రూ.411 పలకగా ఈ ఏడాది రూ.19అదనంగా పెరిగి రికార్డు సృష్టించింది. శుక్రవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో కిలో పొగాకు ధర రూ.418 చేరింది. ప్రస్తుతం కిలో ధర 430కు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాము పడిన శ్రమకు చివరిలోనైనా ఊరట లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు వేలం కేంద్రాల్లో ధరలు ఇలా..

కొయ్యలగూడెం వేలం కేంద్రం- క్వాలిటీ పొగాకు కిలో ధర రూ.430, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో ధర రూ.429, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.429, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-18లో రూ.428, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.428,లో-గ్రేడు పొగాకు దేవరపల్లిలో కిలో రూ.130 ఉండగా మిగతా నాలుగు వేలం కేంద్రాల్లో రూ.200గా ఉంది. లో-గ్రేడు పొగాకు ధరలు పెరిగితే రైతులకు లబ్ధి చేకూరినట్లు అవుతుంది.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో నిర్వహించిన దత్తహోమంలో పాల్గొన్న భక్తులు

మహాసంస్థానానికి పోటెత్తిన భక్తులు

పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో మహారాష్ట్ర, ఒరిస్సాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకాలు, దత్తహోమం, గోపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాయి



తాళాబత్తుల సాయి

పెద్దాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత డాక్టర్ తాళాబత్తుల సాయిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేస్తానని విశ్వబ్రాహ్మణులు, చేతివృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారికి ప్రభుత్వం ద్వారా వచ్చేటువంటి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తానన్నారు. డైరెక్టర్‌గా నియమితులైన సాయి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రముఖులు, కూటమి నేత లు సాయిని అభినందించారు.

లోక్ అదాలత్‌లో 4733 కేసుల పరిష్కారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్చార్జి) మాధురి



బ్యాంకు చెక్కు నమూనాను అందజేస్తున్న జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4733 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరిగిందని, దీంతో రాష్ట్రంలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్చార్జి) ఎం.మాధురి తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన కేసుల్లో లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుంటే పరిహారం కోసం ఎక్కువ రోజులు వేచి చూడాల్సిన అవసరం లేదని, బాధితులు తన బ్యాంకు ఖాతాను ఇన్స్యూరెన్స్ కంపెనీకి తెలియజేసిన నెల రోజుల్లో పరిహారం సొమ్ము ఖాతాలో జమ అవుతుందన్నారు. రాజీ ద్వారా ఇరువర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 ప్రత్యేక న్యాయపీఠాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా వివిధ కేసుల్లో రూ.16.36 కోట్ల పరిహారం అందజేసినట్టు మాధురి పేర్కొన్నారు.కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి ఉమాసునంద, ఏసీబీ కోర్టు జడ్జి వెంకటేశ్వరరావు,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జానీబాషా తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆలయం భక్తులతో కిటకిట



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

స్వామివారికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, సెప్టెంబరు 13ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే వేద మంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో కళకళ్లాడాయి. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈవో సత్యనారాయణరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10,116

బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన అక్కినేని బాలకృష్ణ-షాజని దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకుడు ఆశీర్వచనం అందించారు. సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం



ప్రసంగిస్తున్న స్వామి లోకమయానందజీ, పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని స్వామి లోకమయానందజీ మహరాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ మిషన్‌లో శనివారం స్వామి వివేకానంద చికాగో నగర ప్రసంగాల ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థు లకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద శీల సంపద,తీక్షణమైన బుద్ధి, అపర మేధాశక్తి కలవారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీ సుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం వైపు దృష్టి పె ట్టాలని లక్ష్యసాధన కోసం రాత్రింబవళ్లు, కష్టించి, పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ప్రసంగించారు.

భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం



స్వామి దర్శనానికి లైన్లలో వేచి ఉన్న భక్తులు

» వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.81.54 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వా మి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం చిరుజల్లులలోను తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామునే స్వామి వారి కి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహో మం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల ఫల పు ష్పాలతో అలకరించారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తుల భారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన సుంకవల్లి వినిత్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి సన్నిధిలో భక్తుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్క రోజు ఆదాయం రూ.81.54 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు తెలిపారు.

బస్సుల కోసం మహిళా భక్తులు ఎదురుచూపులు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన మహిళా భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూపులు చూశారు.రెండో శనివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తజనం ఆలయానికి రావడంతో ఉచిత దర్శనం, రూ.50 దర్శనానికి గంటలు తరబడి లైన్‌లో అవస్థలు పడ్డారు. మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణ పథకం ఉండటంతో బస్సుల్లో వివిధ ప్రాంతాలు నుంచి వాడపల్లి సన్నిధికి చేరుకున్నారు. మహిళా భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్వామి దర్శనం ముగించుకుని తమ ఇళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు కోసం గంటల తరబడి నిరీక్షించారు. రావులపాలెం నుంచి ఒక బస్సు వస్తే అందులో సుమారు ఎనభై మంది ఎక్కారు. వాడపల్లి నుంచి కొత్త వంతెన వరకు కిలోమీటర్లు మేర ఆర్ అండ్‌బీ రోడ్డు వైపు నడుచుకుంటు ముందుకు సాగారు. మరికొంతమంది రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురు చూశారు. బస్సు ఆగిన వెంటనే గుంపులు గుంపులుగా బస్సు ఎక్కారు.



వాడపల్లిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

కన్నుల పండువగా శాంతి కల్యాణం

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి.. ముగిసిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, సప్తదశ కలశ ప్రోక్షణ, శాంతి కల్యాణం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అను వంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాసాని మణికంఠాచార్యులు పూజా ధికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, యజ్ఞలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఆల య అనువంశిక అర్చక స్వాములు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి,సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, కటకం చలం, తెలగంశెట్టి శ్రీను, గరగ శ్రీధర్‌బాబు, బదిరెడ్డి దొరతోపాటు కోరుకొండ పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మండపేటలో రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలు



టెన్నీకాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేటలో రెండురోజులపాటు జరిగే 49వ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ప్రారంభించారు.తొలుత జాతీయ పతాకం ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ఆటలను ప్రారంభించారు. క్రీడల్లో యువత రాణించి దేశానికి పేరు తీసుకురావాలని వేగుళ్ల పిలుపునిచ్చారు. క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. తొలిరోజు పోటీల్లో 15 జిల్లాలకు చెందిన 15 జట్ల నుంచి 120 మంది క్రీడాకారులు బాలురు, బాలికల విభాగాల్లో తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో క్రీడాభిమానులకు ఉత్కంఠను రేకెత్తించాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాణి, శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి, కోశాధికారి కుంచే రమేష్, ముంగర వెంకట్రాజు, గెడా శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేశవస్వామి సేవలో డీఎస్పీ



ఆత్రేయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బిహెచ్‌వి రమణమూర్తి స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పిల్లలు సరిగ్గా చూడట్లేదని గోదావరిలోకి దూకిన వృద్ధుడు


జొన్నాడ బ్రిడ్జి మీద నుంచి గోదావరిలోకి దూకిన వృద్ధుడిని రక్షించి తీసుకొస్తున్న దృశ్యం

కాపాడిన పోలీసులు

ఆలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సరిగ్గా చూడట్లేదనే మనస్తాపంతో గోదావరిలోకి దూకేశాడు ఓ వృద్ధుడు. పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ వివరాలను ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన కుంపట్ల సత్యనారాయణ (65) శనివారం ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జి నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్తున్న 2023 బ్యాచ్ డీఎస్పీ పి.ప్రదీప్తి గమనించారు. దీంతో స్థానిక ఎస్‌ఐ నరేష్‌కు సమాచారం అందించగా అక్కడికి దగ్గర్లో ఉండడంతో హుటాహుటిన చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి దూకి రెయిలింగ్‌కి వేలాడుతున్న వృద్ధుడిని కానిస్టేబుల్ పలివెల రాజు, మొబైల్ హోంగార్డు సాయి, జొన్నాడకు చెందిన జక్కల సూరిబాబు, కోమలి దుర్గప్రసాద్ రక్షించారు. ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. "నేను బాగా బతికాను. నా పిల్లలు సరిగ్గా చూడట్లేదు. అందుకే మనస్తాపంతో చనిపోవాలనుకున్నాను" అని సత్యనారాయణ పేర్కొన్నాడు.

భార్య పట్టించుకోవట్లేదని విద్యుత్ టవర్ ఎక్కిన భర్త

పోలీసులు నచ్చజెప్పడంతో కిందికి వచ్చిన వైనం
టవర్‌కు పవర్ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


కిందకు దిగిన సాయిబాబుకు నీరు తాగిస్తున్న ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య


విద్యుత్ టవర్‌పై సాయిబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులు తన భార్యను పుట్టింటికి తీసుకెళ్లడం, ఆమె తనను పట్టించుకోవట్లేదనే కోపంతో భర్త విద్యుత్ టవర్ ఎక్కేశాడు. చివరికి పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో కిందకి దిగి వచ్చాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... పి.గన్నవరం మండలం లంకలగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన పెన్సింగి సాయిబాబు (48) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన భార్య తో జరిగిన గొడవల నేప థ్యంలో పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో కొబ్బరి తోటల్లో ఉన్న భారీ విద్యుత్ టవర్ ఎక్కాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపగా టవర్ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం టవర్‌పై ఉన్న సాయిబాబుతో ఏఎస్‌ఐ ఎస్.పట్టాభిరామయ్య ఫోన్‌లో మాట్లాడారు. నీ సమస్యను మేం పరిష్కరిస్తాం.. ముందు టవర్ దిగాలని నచ్చచెప్పారు. దీంతో సుమారుగా గంట పాటు టవర్‌పై ఉన్న సాయిబాబు పోలీసులు నచ్చచెప్పడంతో కిందికి దిగి వచ్చాడు. సాయిబాబు టవర్‌దిగిన వెంటనే పోలీసులు తాగునీరందించి స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 3 రోజుల క్రితం భార్య, భర్తకు జరిగిన తగాదాలు నేపథ్యం లో సాయి బాబును ఆమె పుట్టింటి వారు మంద లించి భార్యను తీసుకెళ్లిపోయారని స్థానికులు చెప్తున్నారు. తనకు న్యాయం జరగడంలేదని సాయిబాబు ఆత్మహత్య చేసుకోవడానికి టవర్ ఎక్కాడని అంటున్నారు. కాగా గోదావరికి ఇరు వైపులా ఉన్న భారీ టవర్లకు పవర్ కట్ చేసి పాత అక్విడెక్టుపై నుంచి కొత్తలైన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో టవర్లపై పవర్‌లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్తున్నారు.

మూడుసార్లు ఆత్మహత్యాయత్నం...

సాయిబాబు మాట్లాడుతూ "నేను డ్రైవర్‌గా పనిచేస్తూ నా భార్య గంగాభవాని, ముగ్గురు ఆడ పిల్లలకు ఏలోటు లేకుండా చూసుకుంటున్నా. అయినప్పటికి నా భార్య పట్టించుకోవడం లేదు. ఎప్పుడు నా తమ్ముడు, నా అమ్మ అంటుంది. ఈ విషయం జీర్ణించుకోలేక ఆత్మహత్యకు చేసుకుం దామనుకున్నాను. ఇప్పటికే మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాను. ఒకసారి గ్రామంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకున్నాను, ఇదే టవర్ 2సార్లు ఎక్కాను. గతం ఇదే టవర్‌పైకి ఎక్కి సగంలో నుంచి కిందికి పడిపోతే గాయాలు కూడా అయ్యాయి" అని పేర్కొన్నాడు.

మహిళ అనుమానాస్పద మృతి

కేసు నమోదు చేసిన రావులపాలెం పోలీసులు


మహిళ మృతదేహం

రావులపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పందంగా వృతిచెందిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంక వంతెన సమీపంలో రహదారి చెంతనే ఒక మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండటూ స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో ఆమెను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిన్నట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల ఉండవచ్చని, రహదారి దాటుతుండగా ఏదైనా వాహనం ఢీకొని వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చంటి తెలిపారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నం

స్థలం కొనుగోలు విషయంలో అన్యాయం జరిగినట్టు వెల్లడి

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒక స్థలం కొనుగోలు విషయంలో తనకు వ్రత పురోహితుడు అన్యాయం చేయడంతో మానసిక క్షోభకు గురై ఈ చర్యకు పాల్పడినట్టు తెలిపారు. సోషల్ మీడియాలో ఈవోకు తనకు విభేదంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తప్పుడు ప్రచారం జరిగిందని అది వాస్తవం కాదన్నారు.

21 మందికి రక్త పరీక్షలు.. 19 మందికి చికున్‌గున్యా

● అనారోగ్యంతో లబ్బర్తి, లాగరాయి, కింద్ర ప్రజలు ● సరిగ్గా అందని వైద్యసేవలు


కింద్రలో ప్రజలతో మాట్లాడుతున్న వైద్య బృందం

రాజవొమ్మంగి సెప్టెంబరు 13 (ఆంధ్రజోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో గత 3 నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు ఇటీవల జిల్లా కలెక్టర్ వచ్చి వెళ్లిన తరువాత రోజే మహిళ అనారోగ్యంతో మృతిచెందడం తెలిసిందే. అయితే అనారోగ్యానికి గల కారణాలు తెలియకపోవడంతో స్టేట్ టీం కింద్రలో ఈనెల 10న వైద్య శిబిరం నిర్వహించి 21మంది నుంచి రక్త నమునాలు సేకరించింది. అయితే వారిలో 19మందికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు అధికారులు శుక్రవారం రాత్రి నిర్ధారించారు. అయితే 21 మందికి పరీక్షలు చేస్తే అందులో 19మందికి పాజిటివ్ రావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెల నుంచే గ్రామంలో ప్రజలు అనారోగ్యానికి గురైతే అప్పట్లోనే అధికారులు ఆరుగురికి రక్త పరీక్షలు చేసి ఒకరికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. అయితే అప్పట్నుంచి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కేవలం పీహెచ్‌సీ పరిధిలో సిబ్బందితో మెడికల్ క్యాంప్ పెట్టామంటూ తంతు గడిపారే తప్ప అధిక సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు చేపట్టలేదు. గ్రామాల్లో పరిస్థితులపై ఆగస్టు 25న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కలెక్టర్‌కు నివేదించడం వల్ల 29న డీఎంహెచ్‌వో వచ్చి ప్రజలతో మాట్లాడి వెళ్లారు. మళ్లీ సెప్టెంబర్ 8న పత్రికల్లో వార్తలు రావడంతో అధికార యంత్రాంగం కదిలి ప్రస్తుతం డిస్ట్రిక్ టీం, స్టేట్ టీం అంటూ గ్రామల్లో చర్యలు చేపడుతున్నారు. ప్రజలు చనిపోతే తప్ప ప్రభుత్వానికి పట్టదా అంటూ ప్రజాప్రతినిధులు ప్రశ్నించినా, అప్పటికే లాగరాయి గ్రామంలో మహిళ మృతిచెందిన ఘటన జరిగింది.

మేం కారకులం కాదు..

లబ్బర్తి, లాగరాయి, కింద్రలో ప్రజలు అనారోగ్యానికి గురికావడానికి కారకులం మేం అంటే మేం కాదు అంటూ వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది వంతు వేసుకుంటున్నారు. 3 గ్రామాల్లో ముందుగా ఒకరికి అనారోగ్యం వచ్చినప్పటికి మిగిలిన వారికి 3 నెలల వ్యవధిలో వ్యాప్తి చెందిందని, అనారోగ్యానికి గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, మందులు ఇవ్వడంలో వైద్యాధికారులు విఫలమయ్యారంటూ సర్పంచ్‌లు చెప్తున్నారు. అయితే గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగానే అనారోగ్యమంటూ వైద్యాధికారులు వాదిస్తున్నారు.

అర్ధరాత్రి మద్యం దుకాణంలో చోరీ

తునిలో వరుస దొంగతనాలు

తుని రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు హల్‌చల్‌తో పట్టణవాసులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలు మరువక ముందే శుక్రవారం అర్ధరాత్రి తరువాత మరో దొంగతనం జరిగింది. పట్టణంలో ఫైర్ ఆఫీస్ పక్కన ఉన్న మద్యం దుకాణంలో దొంగ ప్రవేశించి చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీపుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అదేరోజు మరికొన్ని దుకాణాల్లో దొంగతనాలు జరిగినట్టు తెలుస్తుంది. వీటిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.


మద్యం దుకాణంలో సీసీ పుటేజ్ దృశ్యం

త్రుటిలో తప్పిన ప్రమాదం

● సఖినేటిపల్లి రేవులో అదుపు తప్పిన పంటు ● ఒడ్డుకు చేర్చిన డ్రైవర్


సఖినేటిపల్లి రేవులో అలల ఉధృతికి అదుపు తప్పిన పంటు

అంతర్వేది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో నిత్యం ప్రయాణికులతో పంటు రాకపోకలు రద్దీగా జరుగుతాయి. అయితే శనివారం అలల ఉధృతి కారణంగా పంటు అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో పంటును ఒడ్డుకు చేర్చడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. చించినాడ వంతెన మరమ్మతుల నేపథ్యంలో బస్సులకు రాకపోకలు నిలిపి వేయడంతో సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేందుకు ప్రయాణికులు అధికంగా ఉండడంతో, అలల ఉధృతి కూడా పెరగడంతో పంటు అదుపుతప్పింది. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంటు డ్రైవర్ నేర్పుతో పంటును ఒడ్డుకు చేర్చాడు. ఇప్పటికైనా అధికారులు ఓవర్ లోడ్ వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరపలో అగ్నిప్రమాదం

రూ.3 లక్షల ఆస్తినష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరప, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగి రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో తిరుమల వైన్స్ షాపును చేర్చి ఆరు గుడిసెల్లో రాయల్ దాబా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం కిచెన్ షెడ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లో చుట్టూ ఉన్న గుడిసెలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు గుడిసెలు అగ్నికి ఆహుతై వాటిట్లని ఫర్నీచర్, ఫ్రిజ్‌లు, కిచెన్ సామాగ్రి కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ ఏడీఎఫ్‌వో బి.ఏసుబాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. రెండు గంటల పాటు సిబ్బంది శ్రమించి ఫైరింజన్‌తో మంటలు ఆర్పడంతో పక్కనే ఉన్న వైన్‌షాపు, మిగిలిన మూడు గుడిసెలకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టుగా కరప పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైర్వవిహారం

పది మందికి తీవ్రగాయాలు
భయాందోళనకు గురైన ప్రజలు


బాధితులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది


పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కకాటు బాధితులు



పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైర్వవిహారం చేసింది. పదిమందికి పైగా గాయాలయ్యాయి. పట్టణంలోని సాలిపేట, తారకరామనగర్ ప్రాంతాల్లో రోడ్డుపై నడిచి వెళ్తున్న, ఇళ్ల వద్ద బయట ఉన్న వారిని విచక్షణారహితంగా కరిచింది. దారిపోడవునా ఎవరిని వదలకుండా దాడి చేయడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పది మందికి పైగా తీవ్ర గాయాలు కాగా వారంతా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమి త్తం వెళ్లారు. కొందరికి లోతుగా గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. తారకరామనగర్‌కు చెందిన బూరాడ లక్ష్మి, మార్కెట్ వీధికి చెందిన ముత్తుర్తి శివ, సాలిపేటకు చెందిన కాకి కుక్కేటేశ్వరరావు, మేకా వారి వీధికి చెందిన కోట వీర్రాజు, విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా వీర వెంకట సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణానికి చెందిన పప్పు వరప్రసాద్ సహా పలువురు గాయాలబారిన పడారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ శ్రీరామచందర్‌మూర్తి మృతికి సంతాపం


శ్రీరామచందర్ మూర్తి (ఫైల్)

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ మంతెన శ్రీరామచందర్‌మూర్తి మృతికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ బాబు, తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ అసోసియేషన్ శనివారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ మాట్లాడుతూ మంతెన శ్రీరామచందర్‌మూర్తి హైదరాబాద్ అండర్-19 స్కూల్స్ టీం, సౌత్‌జోన్ స్కూల్స్ టీం, అండర్ 25 క్రికెట్ మ్యాచ్‌లు హైదరాబాద్ తరుఫున ఆడి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశారని తెలిపారు. అలాగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున జూనియర్ స్టేట్, రంజీ ట్రోఫీ, సౌత్ జోన్ యూనివర్సిటీస్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆయన తూర్పుగోదావరిజిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూడా విధులు నిర్వహించారని తెలిపారు. ఆయన మృతి క్రికెట్ సర్కిల్‌లో విషాదం నింపిందన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ పూజలు


సత్యదేవుడి దర్శనానంతరం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్, ఐఆర్ఎస్ అధికారి ఆనంద్ రాజేశ్వరీ బెహర్ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో ప్రసాదం అందించారు. అలాగే రాజమండ్రి జాయింట్ కలెక్టర్ కె.రాములు స్వామివారిని దర్శించుకున్నారు.

బాలబాలాజీ దేవస్థానం ఈవోగా సత్యనారాయణరాజు


సత్యనారాయణరాజు

మామిడికుదురు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఈవోగా ఎం.సత్యనారాయణరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయన 94 రోజులు వ్యక్తిగత సెలవుపై విదేశాలకు వెళ్లి తిరిగి శనివారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ తాత్కాలిక ఈవోగా వ్యవహరించారు. ఆయనకు ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి తిరుచ్చిసేవ

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, మేళతాలాలతో ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దల దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. విశాఖపట్నంకు చెందిన మద్ది శ్రీనివాసరావు రూ 1,00,116, విజయవాడకు చెందిన పిల్లా అమ ర్నాధ్, అపర్ణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఈవో సుబ్బారావుకు శనివారం అందజేశారు. దాతలను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం,ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


విరాళం అందజేస్తున్న దాత అమర్నాధ్

రూల్స్ పాటించని ప్రైవేట్ బస్సులు

రూ.1.93 లక్షల అపరాధ రుసుం

రావులపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట వద్ద జాతీయ రహదారిపై ఈతకోట టోల్‌ప్లాజా వద్ద జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రైవేట్ బస్సులను శనివారం తనిఖీ చేశారు. 20బస్సులు రికార్డులను పరిశీలించగా నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో నిర్వాహకుల నుంచి రూ.1,93,600 అపరాధ రుసుంగా వసూలు చేశారు. దీనిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక ప్రైవేట్ బస్సును సీజ్ చేసి రూ.1,22,000 పన్ను, అపరాధ రుసుం వసూళ్లు చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు ప్రతీ వారం నిర్వహిస్తున్నామని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని, అదే విధంగా వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.

కొమ్మ కొమ్మకో..!



కొమ్మ కొమ్మకు స్టీల్, సిల్వర్ పాత్రలు ఉన్నాయి ఏమిటీ అనుకుంటున్నారా.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో దబ్బగూడెం గ్రామంలోని ఓ ఇంటి పెరట్లో ఎండిన చెట్టును ఓ గిరిజనుడు ఇలా మలిచాడు. కడిగిన వంట పాత్రలను ఇలా ఎండిపోయిన చెట్టు కొమ్మలకు తగిలిస్తూ సమయాన్ని ఆదా చేస్తున్నాడు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

మామిడికుదురు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులు కృషిచేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. సొసైటీచైర్మన్ ఈలి శ్రీనివాస్, సభ్యులు కాకి శ్రీనివాస్, మట్టా సత్యనారాయణ శనివారం ఎమ్మెల్యే దేవ, రాంబాబును కలిశారు.

శెట్టిబలిజ కుల సర్టిఫికెట్ల జీవోపై హర్షం

కాట్రేనికోన, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులాలకు బీసీ-బీ సీరియల్ నెం.4గా కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వం జీవో జారీచేయడంపై ఆ సామాజిక వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల వెంకటసాయి అధ్యక్షతన నాయకులు శనివారం కాట్రేనికోనలో సమావేశమై జీవో జారీకి కృషిచేసిన మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుభాష్ తన సామాజిక వర్గానికి న్యాయం చేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేశారని నాయకులు వ్యాఖ్యానించారు. శీలం సూర్యనారాయణ, విత్తనాల వెంకటరమణ, కడలి వెంకటసత్యనారాయణ, వనచర్ల నాగేశ్వరరావు, విత్తనాల బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వరరావు, కముజు సర్వేశ్వరరావు, గొవ్వాల సత్తిబాబు, శీలం ప్రసాద్, కొప్పిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

వైసీపీ చీకటి జీవోను సవరించిన కూటమి ప్రభుత్వం


థాంక్యూ సీఎం గారు అంటూ పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వార్తలు సృష్టించి కులాల మధ్య చిచ్చుపెట్టి రాద్ధాంతం చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ, గీత కులాలకు ముందు గౌడ పేరు చేరుస్తూ గత వైసీపీ ప్రభుత్వం చీకటి జీవోను జారీ చేసిందని గుర్తుచేశారు. అప్పట్లో కులంలో వ్యతిరేకత వస్తుందని భావించిన నాటి బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ తాత్కాలికంగా జీవోను నిలుపుదల చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జీవో తెర మీదకు రావడంతో శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రంలో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. దానిని గ్రహించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ చీకటి జీవో విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆ జీవోను సవరిస్తూ నూతన జీవోను మంత్రి సుభాష్ విడుదల చేయించారన్నారు. పేరూరులో శనివారం శెట్టిబలిజ సంఘ ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ కొత్తగా జీవోను విడుదలచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, అందుకు కృషిచేసిన మంత్రి సుభాష్‌కు సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలను మానుకుని అన్నదమ్ములుగా ఉన్న కులాల మధ్య చిచ్చు రగిలిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ పెద్దలు పెచ్చెట్టి విజయలక్ష్మి, చొల్లంగి సత్యసాయిబాబా, వాసంశెట్టి చినబాబు, గుబ్బల రాంప్రసాద్, గుత్తుల నాగేశ్వరరావు, ఇళ్ల రాము, మట్టపర్తి జగదీష్, పలివెల శ్రీనివాస్, మట్టపర్తి సాయిబాబు, కొప్పిశెట్టి శ్రీధర్, పెచ్చెట్టి కన్నా, కడలి వెంకటేశ్వరరావు, దొమ్మేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియాతో ఆరోగ్యవంతమైన సమాజం


అమలాపురంలో ఫిట్ ఇండియాలో భాగంగా సైక్లోథాన్ పోటీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఫిట్ ఇండియా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఫిట్ ఇండియాలో భాగంగా అమలాపురం పరంజ్యోతి స్కూలు ఆధ్వర్యంలో వాకథాన్, సైక్లోథాన్ కార్యక్రమాలు నిర్వహించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ విల్‌ఫ్రెడ్, స్పోర్ట్స్ మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏడు కిలోమీటర్ల మేర ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పేరూరు వై-జంక్షన్ వద్ద వాకథాన్ కార్యక్రమాన్ని కిమ్స్ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. సైక్లోథాన్ కార్యక్రమాన్ని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, రెవ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి తదితరులు పాల్గొని ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

శివకోటిలో మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శివకోటిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో దొంగ హరిబాబు-సత్యలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమారుడు సాయికిరణ్ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. శివకోటి హైస్కూలును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, దానికి స్థానిక పెద్దలు ముందుకు రావాలన్నారు. 200మందికి బీపీ, షుగర్, ఈసీజీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, గుబ్బల ఫణికుమార్, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, మేడిచర్ల సత్యవేణి, పినిశెట్టి బుజ్జి, సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి త్రినాథస్వామి, కడలి కపిల్, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్,సూరిశెట్టి శ్రీనివాస్, మంగెన భూదేవి, మోకా పార్వతి, కడలి ఏడుకొండలు, ఆరుమిల్లి భాను పాల్గొన్నారు.

'సత్వర న్యాయం అందించేందుకే లోక్ అదాలత్'

ముమ్మిడివరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జడ్జి రహ్మతుల్లా ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. 209 కేసులు పరిష్కారం కాగా రూ.20,23,856 వసూలైంది. వీటిలో ఓఎస్ టైటిల్ 2కేసులు, ఓఎస్ మనీ రెండు కేసులకు సంబంధించి రూ.3.36లక్షలు, ఐపీసీ సీసీ 29 కేసులకు రూ.2.70లక్షలు, ఎక్సైజ్ 39 కేసులకు రూ.2,13,620, అడ్మిషన్ కేసులు నాలుగుకు రూ.44వేలు, బ్యాంకు పీఎల్‌సీ 10 కేసులకు రూ.4.33లక్షలు, బీఎస్ఎన్ఎల్‌పీఎల్సీ 7కేసులకు రూ.5,236, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సీసీ 70కేసులకు రూ.7లక్షలు, ఎస్‌టీసీ 46 కేసులకు రూ.22లక్షలు అపరాధ రుసుం వసూలైనట్టు జడ్జి రహ్మతుల్లా తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఏజీపీ కాశి సిద్ధార్థకుమార్, టి.నాగరాజారావు, బీర ప్రసాద్‌బాబు, జి.శ్రీనివాసరావు, కేఎల్వీ ప్రసాదరావు, ఎం.అలీహసన్, కె.అఖిలేష్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

136కేసుల పరిష్కారం

రాజోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజోలు న్యాయ సముదాయాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. 136 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రమీలారాణి, హిమబిందు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా రూ.61.92లక్షల ఆర్థిక లావాదేవీలు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు వై.లక్ష్మీ సుధీర్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్ పుట్టినరోజు వేడుకలు

ఐ.పోలవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పుట్టినరోజు వేడుకలు శనివారం జి.వేమవరంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీ చోడిశెట్టి రాధాకృష్ణ, చోడిశెట్టి బ్రహ్మానందం, నీటిసంఘం చైర్మన్ చోడిశెట్టి నాగబాబు, లంకలపల్లి మునిరాజు, మద్దింశెట్టి పురుషోత్తం, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు ప్రతిభ అవార్డు అందిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, సెప్టెంబరు 13ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం మామిడికుదురు మండలశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభ పురస్కార కార్యక్రమం శనివారం అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగింది. సంఘ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంబేడ్కర్ కన్న కలలు సాకారమయ్యే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 63మంది విద్యార్థులకు రూ.1.50లక్షల విలువైన ప్రతిభా పురస్కారాలు, మెమెంటో అందించి అభినందించారు. ఇటీవల జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, ఎంపీపీ కె.వనజాకుమారి, ఎంఈవో కె.హెలీన, సంఘ జిల్లా అధ్యక్షుడు బి.నకులరాజు, నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి, కారుపల్లి కల్యాణ్‌బాబు, నేల శ్రీనివాసరావు, సంఘ సభ్యులు బయ్యా మోహనరావు పాల్గొన్నారు.

'ఏ సమస్య పరిష్కారం కాలేదు'


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్

అమలాపురంటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినా విద్యారంగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు కిశోర్‌కుమార్, ఎస్.జ్యోతిబసు విమర్శించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారంతో పాటు పరీక్షల మూల్యాంకనం, విద్యాశక్తి కార్యక్రమాలు వంటి బోధనేతర పనులకు ఉపాధ్యాయులపై విపరీతమైన పని ఒత్తిడి పెరిగిందన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా శాఖ అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన కిశోర్‌కుమార్, జ్యోతిబసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ డీఏలు విడుదల చేయాలన్నారు. పాఠశాల, విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈనెల15 నుంచి 19వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో యూటీఎఫ్ రణభేరి జాతా జరుగుతుందన్నారు. ఈనెల25న రాష్ట్ర బహిరంగ సభ ద్వారా రణభేరి కార్యక్రమాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీఏఎస్ సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షులు జీవీ రమణ, సీతాదేవి, కోశాధికారి సీహెచ్ కేశవరావు, జిల్లా, మండల, పట్టణశాఖల కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

యానాం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): యానాంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శ్రీకారం చుట్టారు. ప్రజాపనులుశాఖ, మున్సిపాల్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి అంకిత్ కుమార్, అధికారులు భూమి పూజ నిర్వహించారు. కనకాలపేట, మెట్టకుర్రు, గణపతినగర్, గిరియంపేట గ్రామాల్లో రూ.1.16కోట్లతో రోడ్లు, డ్రైన్లు చేపట్టనున్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక గ్రామ ప్రతినిధులుపాల్గొన్నారు.

రేషన్ వ్యవస్థ బలోపేతానికి స్మార్ట్ రేషన్‌కార్డులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 14, 15 వార్డుల్లో శనివారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో చింతలపూడి బాబూరావు, మాదాల పరంకుశం, మాదాల కుమార్, యేడిద శివ, మాదాల శ్రీధర్, సరిపెల్ల శ్రీనురాజు, గొల్లపల్లి గోపి, గొవ్వాల శ్రీను, మాదాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాలపై కేసులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలు పాటించని ఎనిమిది ప్రైవేటు బస్సులపై జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు జరిమానా విధించారు. అన్నంపల్లిటోల్‌ప్లాజా వద్ద జిల్లా రవాణాశాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. ఎనిమిది ప్రైవేటు బస్సులు నిబంధనలు పాటించకపోవడంతో వాటిపై కేసులు నమోదు చేసి రూ.1200 జరిమానా విధించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈతనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిన్ని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలని ఎంపీ హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు పేర్కొన్నారు. పి.గన్నవరంలో శనివారం ఎడ్యూటెక్ స్టడీ సెంటర్‌ను వారు ప్రారంభించి అనంతరం మాట్లాడారు. టెస్ట్‌బుక్స్ పరిశీలించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉచితంగా డెమో తరగతులు నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సీనియర్ అడ్వయిజర్ కేఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సంస్థ జోనల్ అడ్వయిజర్ రాకేష్‌తిలక్, తహశీల్దార్ బి.మృత్యుంజయరావు, నక్కా సునీల్, ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు శ్రీనుబాబు, తొలేటి బంగారునాయుడు, నిమ్మకాయల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు పి.గన్నవరం విద్యార్థులు


విద్యార్థులతో హెచ్‌ఎం ఉమాదేవి

పి.గన్నవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఈనెల11న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పి.గన్నవరం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి తెలిపారు. సెపక్‌తక్రా అండర్-17 బాలుర విభాగంలో గుమ్మల్ల నితీష్, అండర్-17 బాలికలవిభాగంలో మట్టపర్తి అవంతి, అండర్-14 బాలికల విభాగంలో కడలి హిరణ్యవల్లి ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.భీమేంద్రలను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈనెల17,18,19తేదీల్లో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహిస్తామని ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్రానందం తెలిపారు. డివిజన్ స్థాయి జట్లును ఎంపిక చేస్తామన్నారు. ఈపోటీలకు ఆర్గనైజింగ్ చైర్మన్లుగా ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి, నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా కె.వి.రమణ, మండల కోఆర్డినేటర్‌గా ఎం.దుర్గాప్రసాద్‌ను నియమించామన్నారు.

ముక్తేశ్వరం జడ్పీ హైస్కూలు విద్యార్థినుల క్షేత్ర పర్యటన


అంబాజీపేట వైఎస్సార్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విద్యార్థినులు

అయినవిల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనలోభాగంగా ముక్తేశ్వరం జడ్పీహైస్కూలు 9,10తరగతుల విద్యార్థినులు శనివారం అంబాజీపేటలోని వైఎస్సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలను అనేక అంశాలపై విషయాలు అడిగి తెలుసుకున్నారు. కొబ్బరిలో వచ్చే వివిధ రకాల తెగుళ్లు, వాటి నివారణ, శిలీంధ్రాల వ్యాప్తికి గల కారణాలు, పరిష్కారాలను తెలుసుకున్నారు. కొబ్బరిలో అంతరపంటలు కోకో, అరటి, కంద మొదలగు పంటల గురించి, వాటి వల్ల వచ్చే అదనపు ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలిచ్చారు. పాఠశాల హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సందర్శనలో ఒకేషనల్ ట్రైనర్ ఎల్.కమలప్రియ, జి.సాయిశ్రీనివాస్, వై.వెంకటేష్, జి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

యానాం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిఆంధ్రపేటకు చెందిన గ్రామ ప్రతినిధి పెట్టారాముడు మనమరాలు ఇటీవల ఆపరేషన్ చేయించుకుంది. శనివారం గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రూ.25వేలు, బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు రూ.5వేలు అందించారు.

శ్రీచైతన్య సాంస్కృతిక మహోత్సవం


పేరూరులో శ్రీచైతన్య సాంస్కృతిక మహోత్సవంలో విద్యార్థినుల ప్రదర్శనలు

అమలాపురంరూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య జూనియర్ కళాశాల వార్షిక సాంస్కృతిక మహోత్సవాన్ని ఫెస్ట్-2025 పేరిట పేరూరు వీఆర్కే ఫంక్షన్ హాలులో శనివారం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత నీట్, జేఈఈ మెయిన్స్ వంటి జాతీయస్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. ఉపాధ్యాయులను, అధ్యాపకులను విద్యార్థులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. శ్రీచైతన్యఏజీఎం హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్య అనేది కేవలం మార్కులకే పరిమితంకాదని నైతిక విలువలు, సమాజ సేవాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. జోన్ డీన్ వేగి రాంబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు సాధిస్తున్న విజయాలను వివరించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఆధునిక, సంప్రదాయ, కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పరిపాలనాధికారి సయ్యద్ బాజీ పాల్గొన్నారు.

కార్యకర్తలకు జనసేన ఆర్థిక భరోసా

పి.గన్నవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. గంటిపెదపూడి గ్రామానికి చెందిన ఈరి సాయికృష్ణ, అంబాజీపేట మండలం కొర్లపాటివారిపాలేనికి చెందిన కొర్లపాటి అరిగెల శ్రీనివాసరావు, మామిడికుదురు మండలం పాశర్లపూడికి చెందిన బోనం బాపిరాజు ఇటీవల మృతిచెందారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున బీమా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ఐ.పోలవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితుల ప్రభావంతో పిల్లల నడవడికపై తల్లితండ్రులు దృష్టి సారించాలని ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. గుత్తెనదీవిలో శనివారం డ్రగ్స్ నిర్మూలనపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. దీనికి ముందు గ్రామంలో డ్రగ్స్ వద్దు అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. పిల్లలను సక్రమ మార్గంలో చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్, ఎస్ఐ రవీంద్రబాబు, జనసేన నాయకులు పడాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు, పాలిటెక్నిక్‌లో ఉచిత శిక్షణ

పి.గన్నవరం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ధనవర్ష పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణతో పాటు విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో శిక్షణ ఇస్తామని సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ తెలిపారు. పి.గన్నవరం ధనవర్ష ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన ధనవర్ష సభ్యసమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సంఘం రూ.72.19కోట్లతో నడుస్తోందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.79.36లక్షలు లాభాలు వచ్చాయన్నారు. అనంతరం సంఘ అభివృద్ధి, ఉచిత శిక్షణపై సభ్యులకు వివరించారు. ఇంఫాట్ ఇంటర్నేషనల్ రీజనల్ అధ్యక్షుడు కె.సత్యనారాయణమూర్తి, రీన్యూ బ్రైబినరి మేనేజర్ ఎస్.బాలదుర్గాప్రసాద్, సంఘ ఆడిటర్, సంఘ డైరెక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్మార్ట్‌రేషన్‌కార్డుల్లో జిల్లా పేరు మార్పుపై ఆందోళన వద్దు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పి.గన్నవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):స్మార్ట్ రేషన్ కార్డుల్లో జిల్లా పేరు మార్పుపై ఆందోళన చెంద వద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. శని వారం 'ఆంధ్రజ్యోతి'లో తూర్పుగోదావరి జిల్లా పేరుతో స్మార్ట్ రేషన్‌కార్డులు ప్రచురితమైన కథనానికి అధికారులు, టీడీపీ దళిత నాయకులు దృష్టి సారించారు. ఈనేపథ్యంలో టీడీపీ దళిత నాయ కులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఆధార్‌కార్డుల ఆధారంగా స్మార్ట్‌రేషన్ కార్డుల్లో జిల్లాల పేర్లు ముద్రించారని ఎమ్మెల్యే చెప్పారు. ఈవిషయమై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో మాట్లాడినట్టు చెప్పారు. ఈసమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని 15రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అప్పటి వరకు రేషన్‌కార్డులు పంపిణీని తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు.

సాంకేతిక లోపంతో జిల్లా మార్పు

మలికిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ వేగంగా జరుగుతుందని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. కార్డుల ముద్రణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులుగా ఉమ్మడి జిల్లా తూర్పుగోదావరి పేరు చాలా కార్డుల్లో వచ్చిందని, దీనికి కారణం ఆధార్ కార్డు డేటా ప్రకారం జరిగిందన్నారు. జిల్లా మార్పు వల్ల ప్రభుత్వ పథకాలు అందుకోవడంలో ఎటువంటి అభ్యంతరాలు ఉండవన్నారు. మార్పు కోసం ఎడిట్ ఆప్షన్ వస్తుందని, అప్పుడు ఈకార్డుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చుకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు.

సాంకేతిక పొరపాటు

మామిడికుదురు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డుల్లో సాంకేతికంగా జరిగిన పొరపాటు వల్లే జిల్లా పేరు మార్పుగా వచ్చిందని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాల్లో ఇటువంటి పొరపాట్లు జరిగాయని, మన జిల్లాలో మాత్రమే ఈవిధంగా జరగలేదన్నారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డుల ద్వారా అన్నిరకాల రాయితీలు, నిత్యావసరాలు పొందవచ్చన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం పంపిణీ

అంబాజీపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం నేదునూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయి నాగవెంకటరమణ కుటుంబం రోడ్డున పడింది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బాలరాజు, విశ్వనాథం, రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మోదీ జన్మదినం.. సేవా కార్యక్రమాలు చేపట్టాలి

మలికిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల17న ప్రధానినరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మలికిపురంలో శనివారం జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనా దక్షత, సంక్షేమ పథకాల ప్రగతి ఫలాలు ప్రజలకు వివరిస్తూ రక్తదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్, పార్టీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణుక్య, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు దొడ్డా నాగబాబు, కట్టా రవి, అనిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

'విద్యాశక్తి' ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదు

ముమ్మిడివరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యాశక్తి కార్యక్రమం బలవంతం కాదని చెబుతూనే ప్రధానోపాధ్యాయులతో బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్దించడం సరైన విధానం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ మునేశ్వరరావు, యు.వెంకట్రావులు పేర్కొన్నారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు వారీగా నాలుగు నుంచి ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పటికే కోనసీమ జిల్లా ప్యాప్టో పక్షాన డీఈవోకు విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని లిఖిత పూర్వకంగా ముందుగానే లేఖ ఇచ్చామన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్దే కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపిక



అంబాజీపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన కేకే సాయిదుర్గ ఎంపికైనట్లు కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. శుక్రవారం కాకినాడలో అండర్-19 స్కూల్‌గేమ్స్ విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేశారు. 55కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి త్వరలో రైల్వే కోడూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సాయిదుర్గ పాల్గొంటుందని తెలిపారు. కోచ్‌లు పితాని భార్గవి, రామచంద్ర, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి అభినందించారు.

ఏఎస్పీ పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భీమవరం ఏఎస్పీ వానుపల్లి భీమారావు విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

వినాయక మండపాల్లో అన్నసమారాధనలు

యానాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):వినాయకచవితి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని పలు మండపాల్లో శనివారం అన్నస మారాధనలు నిర్వహించారు. స్థానిక దోబీవీధిలోని వరసిద్ధి వినాయక మండపంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రవీంద్రనగర్, కాకివారివీధి, రామన్నకోడులలో వినాయక మండపాల్లో నిర్వాహకులు ఘనంగా అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఎమ్మెల్యే సత్యనారాయణ పరామర్శ

అంబాజీపేట, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారి పాలేనికి చెందిన పొట్టుపోతు సుబ్బారావు మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం పరామర్శించారు.కొర్లపాటి చిట్టమ్మ మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని, చిరతపూడిలో దారపురెడ్డి శ్రీనివాస్, మంచాల సాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకులు మైపాల తాతాజీ, కొర్లపాటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, సుంకర బాలాజీ, మేడిద శ్రీను, మట్టపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణంపై న్యాయ విచారణ జరపాలి

అల్లవరం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): దేవగుప్తంలో బాలిక బలవన్మరణం కేసులో న్యాయవిచారణ జరపాలని, బాలిక బలవన్మరణానికి కారకుడైన యెంట్రుకోనకు చెందిన పలివెల వెంకటేష్(మున్నా)ను అరెస్టుచేసి శిక్షించాలని దళిత బహుజన మహిళా శక్తి కన్వీనర్ కొంకి రాజామణి డిమాండ్ చేశారు. దేవగుప్తంలో బాలికకుటుంబాన్ని పరామర్శించి నిజనిర్ధారణ చేశారు. భర్త చనిపోతే ముగ్గురు పిల్లలను పెంచానని బాలిక తల్లి కన్నీటి పర్యాంతమైంది. భూపతి ప్రమీల, అంబటి లక్ష్మి, ఎన్.రమేష్ పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టుల భర్తీలో యానాం అభ్యర్థులకు అన్యాయం

యానాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యానాం విద్యుత్‌శాఖలో 177 హెల్పర్ పోస్టుల భర్తీలో యానాం నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు అర్థాని దినేష్ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్ కల్పించకుండా, రీజియన్ ప్రకారం రిజర్వేషన్ కల్పించడంతో యానాంలోని నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వ తక్షణం స్పందించి రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. యానాంలోని నిరుద్యోగులతో కలిసి సోమవారం యానాం పరిపాలనాధికారిని కలిసి సమస్యను వివరిస్తామన్నారు.

రావులపాలెం కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల రద్దీ

రావులపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతరలు, తీర్థాలు జరిగే సమయంలో ఆ ప్రాంతం జనంతో నిండి కోలాహలంగా ఉండటం సాధారణం. శనివారం రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ మహిళా ప్రయాణికులతో రద్దీ నెలకొంది. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లివచ్చే వారితో కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. రెండవ శనివారం సెలవు రోజు కావడంతో మహిళా ప్రయాణికులు పోటెత్తడంతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ డీఎం కుమార్‌తో పాటు యూనియన్ నాయకులు పర్యవేక్షించారు.

ఆలమూరును తూర్పులో విలీనం చేయాలి

• మళ్లీ తెరపైకి వచ్చిన సమస్య • ఆందోళనకు సిద్ధమవుతున్న నాయకులు

ఆలమూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలు జిల్లాల ఏర్పాటు, పరిధిలను హడావిడిగా చేశారు. దీంతో ఆయా జిల్లా పరిధిలను మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో ఆలమూరు మండల సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. రాజమండ్రికి ఆనుకొని ఉన్న ఆలమూరు మండలాన్ని తూర్పులో కలపాలని అప్పట్లో చేసిన యత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం మార్పులకు అవకాశం ఇవ్వడంతో ఆలమూరును తూర్పులో కలపాలని డిమాండ్ అధికమవుతోంది. ఈ నేపథ్యంలో చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అఖిలపక్ష నాయకులను ఏకంచేసే పనిలో పడ్డారు.

జేఏసీ ఏర్పాటుపై కసరత్తు: ఆలమూరు మండలాన్ని తూర్పులో కలపాలన్న డిమాండ్‌తో ముందుకు వెళ్లడానికి మండలానికి చెందిన అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్షం (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేయడానికి గారపాటి శ్రీనివాస్ అధ్వర్యంలో కసరత్తు చేస్తున్నారు. సోమవారం నాటికి ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు, నాయకులను కలిసే విధంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు.



కొత్తపేటలో సమావేశమైన శెట్టిబలిజ నాయకులు

శెట్టిబలిజ ధ్రువీకరణ పత్రంపై తొలగిన ఇబ్బందులు

కొత్తపేట,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ ధ్రువీకరణ పత్రంపై గౌడ పదాన్ని తొలగించి జీవో సవరణ చేసిన కూటమి ప్రభుత్వానికి సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కుల ధ్రువీకరణ పేరును మారుస్తూ కులాల మధ్య చిచ్చుపెట్టిందన్నారు. ఈ విషయమై మంత్రి వాసంశెట్టి సుభాష్, శెట్టిబలిజ కార్పొరేషన్ కుడుపూడి సత్తిబాబులకు విన్నవించగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లి అడ్డంకులు తొలగించారని వారు తెలిపారు. కొత్త జీవోను జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొక్కా వెంకటకుమార్, రెడ్డి శ్రీనివాస్, చిట్టూరి గంగాధరం, దొమ్మేటి కుమార్, గుబ్బల రెడ్డి, చిట్టూరి ఆదినారాయణ, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సహకార ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సహకార ఉద్యోగుల విరమణ 62కు పెంచాలి

ఆలమూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపుదల చేయాలని కోరుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల సంఘం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం ఆలమూరు పీఏసీఎస్ లో జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. దీనికి రాష్ట్ర సహకార ఉద్యోగుల అధ్యక్షుడు తోట వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ గౌరవాధ్యక్షులు నూతన బలరామ్, కోశాధికారి బొబ్బా రామసుబ్రహ్మణ్యచౌదరి, మట్టపర్తి జయరామ్, కుంపట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన తాపేశ్వరం సహకార సంఘం సీఈవో జి.గోవిందును సత్కరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుతో అక్రమాలకు చెక్

కె.గంగవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్ పడుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ అన్నారు. శనివారం శివల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, సర్పంచ్ అనసూరి సాయి, కూటమి నాయకుడు బలుసు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్పుపై ఆందోళన వద్దు

తహసీల్దార్ శ్రీరామప్రసాద్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ వేగంగా జరుగుతోందని తహసీల్దార్ పి.శ్రీరామ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాటాడారు. రైస్ కార్డుల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులుగా, తూర్పుగోదావరి జిల్లా అని వచ్చిందని దీనిపై ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రైస్ కార్డులో మార్పులకు అనుమతి వచ్చినప్పుడు తప్పకుండా జిల్లా మార్పు చేస్తామన్నారు. సచివాలయంలో మార్పు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం త్వరలో కల్పిస్తుందని ఆయన అన్నారు.

జిల్లా పేరు ముద్రణపై ఆందోళన వద్దు

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులో కొంత మందికి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులుగా తూర్పుగోదావరి జిల్లా ముద్రించి ఉందని దీనిపై ఆందోళన అవసరం లేదని తహసీల్దారు ఐపీ శెట్టి సూచించారు. శనివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో జిల్లా పేరును అప్‌డేట్ చేసుకోని వారికి ఆధార్ కార్డు ఆధారంగా జిల్లా పేరు ముద్రించి వచ్చాయన్నారు. ఆధార్ కార్డులో జిల్లా పేరు అప్‌డేట్ చేసుకుని గ్రామ సచివాలయం ద్వారా వాటి సవరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దారు తెలిపారు.

పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు సేవలు ప్రశంసనీయం



సంతాప సభలో మాట్లాడుతున్న వక్తలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ సలహాదారు, వెంకటేశ్వర ఆధ్యాత్మిక కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు స్వర్గీయ పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు సేవలు ప్రశంసనీయమని జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కైరం వీరవెంకట సత్యనారాయణ అన్నారు. శనివారం ద్రాక్షారామ ఫైండా వారి సత్రంలో పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు సంతాప సభ నిర్వహించారు. గడచిన పదేళ్లుగా మాస్టారు ఆధ్వర్యంలో భీమేశ్వరాలయంలో ప్రతీ ఏడాది హరినామ సంకీర్తన సప్తాహాలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి ఆధ్యాత్మిక రంగానికి, భజన కళాకారులకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో రంగంపేట వీరన్న చౌదరి, నీలం శ్రీనివాస్, వడిసలేరు నెహ్రూ, వేళంగి శారద, తులసమ్మ, నాగు, అధిక సంఖ్యలో భజన కళాకారులు పాల్గొన్నారు.

వెదురుపాకలో ఉపాధ్యాయులకు సన్మానం

రాయవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామంలో వెదురుపాక టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గురుపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు నేర్పి విజ్ఞానాన్ని అందించేది గురువులే అన్నారు. వీటీఏ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు నాగులాపల్లి వీరవెంకట సత్యనారాయణ, కొవ్వూరి బుల్లిరెడ్డి, ఉపాధ్యాయుడు షేక్ రషీద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కోనాల సత్తిరాజు, హరిశాస్త్రి, టీజీ సుబ్రహ్మణ్యం, టి.రామచంద్రారెడ్డి, కె.ఏడు కొండలు, సత్తి సతీష్ రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వీటీఏ నేతలు



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1.87 లక్షలు

కొత్తపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,87,666 ఒకరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

నవజనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తొలిహారతి నిర్వహించగా అనంతరం అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భైరిశెట్టి రాంబాబు అధ్వర్యంలో భక్తులు ప్రసాద వితరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పూర్వపు రాయవరం సమితి పంచాయతీరాజ్ మంత్రిత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ రమేష్, ఎన్నికల అధికారిగా ఎం.గోవిందు తదితరులు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడిగా వీఎస్ ప్రసాద్(బిక్కవోలు), ఉపాధ్యక్షుడిగా కేవీవీఎస్ఎస్ఎస్ సాయిబాబా(అనపర్తి), కార్యదర్శిగా వైఎన్ఎన్ గోపాల్(రాయవరం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.మంగరాజు(బిక్కవోలు), జాయింట్ సెక్రటరీగా టీడీ విశ్వనాద్(రామచంద్రపురం), ట్రెజరర్‌గా టి.వరప్రసాద్(రాయవరం), జిల్లా కౌన్సిలర్లుగా కె.మల్లిశ్వరరావు(అనపర్తి), పి.అరుణ్ సాయి(రామచంద్రపురం) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు భాస్కర్, ప్రసాద్, రాయవరం, అనపర్తి, బిక్కవోలు, రామచంద్రపురం మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.



లొల్లలో ప్రకృతి కషాయాన్ని పిచికారికి సిద్ధం చేస్తున్న దృశ్యం

ప్రకృతి సాగు లాభదాయకం

ఆత్రేయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అంతా ప్రకృతి వ్యవసాయంపై ఆధారపడి ఉంటుందని యూనిట్ ఇన్‌చార్జ్ పేరూరి గంగాభవాని, డిజిటల్ ఫెసిలిటేటర్ ఆకుల వీరబాబు, వీఏఏ సాగర్ పేర్కొన్నారు. శనివారం లొల్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా 20 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని పిచికారి చేశారు. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు దండు రామకృష్ణంరాజు, మీసాల తాతారావు, అబ్బిరెడ్డి సత్తిపండు, కాయల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై 15న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

మండపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ఆధ్వర్యంలో 15న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలను నిర్వహిస్తున్నామని ఆ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15 రోజుల నుంచి రైతులు యూరియా కోసం పోరాడుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు, రైతులు ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ పార్టీ నేతృత్వంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం

కె.గంగవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని కూటమి నాయకులు అన్నారు. శనివారం అద్దంపల్లి సచివాలయంలో బదిలీ అయిన ఉద్యోగులను వారు సన్మానించారు. నరజాడ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయురాలు దైవకృప దంపతులను సన్మానించారు. అద్దంపల్లిలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి పెద్దకాపు, కొప్పిశెట్టి నారాయణమూర్తి, దూడల సతీష్, కె.వి.వి. సత్యనారాయణ, నరజాడలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఏ.నాగరాజు, దాసరి శ్రీను, గుణవంతుడు, ప్రేమ్‌కుమార్, టీడీపీ నాయకుడు చిట్టూరి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం ర్యాలి వెంకటేశ్వరనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 4వేల మంది స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎక్కడికక్కడ చెత్త కుప్పలే..

• అక్కరకు రాని తడి,పొడి చెత్త డబ్బాలు • ప్రజల నిర్వాకంపై అధికారుల అసంతృప్తి

మండపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగునకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నప్పటికి ప్రజలకు అవగాహన లేకపోవటం వల్ల ఈ వ్యవహారం తలనొప్పిగా మారుతోంది. పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఏటా ప్రభుత్వం కోట్లాది నిధులు వ్యయం చేస్తున్నది. ఆయా పంచాయతీలు, మున్సిపాల్టీలకు ప్రభుత్వం అందజేసిన వాహనాలను వినియోగించుకోకుండా మూలన పెడుతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ కవర్లను ప్రభుత్వం నిషేధించినా ఎక్కడా ఆగిన దాఖలాలు కనిపించటం లేదు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను వాడిన తర్వాత వాటిని డ్రైన్‌లు, రోడ్డుపక్కన పడేస్తున్నారని పలువురు పర్యావరణ ప్రేమికులు వ్యాఖ్యానిస్తున్నారు. వాటిని ఎక్కడపడితే అక్కడ పడేస్తుండ టంతో మురుగు కాల్వలు, మ్యాన్‌హోల్స్ మూసు కుపోతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో వర్షం పడినపుడు రోడ్లపైకి మురుగు నీరు వచ్చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. అదే విధంగా తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య వాహనం వచ్చినప్పుడు అందించాలని ఎన్ని సార్లు చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదని అధికారులు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వలు, డ్రైన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల మురుగునీరు పోయేందుకు అవి అడ్డంకిగా మారుతున్నాయని అధికారులు ఆరోపిస్తున్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువును ఎలా తయారు చేసుకోవచ్చనే దానిపై ప్రజలకు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు వస్తే తప్ప ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా వృథాయేనని అంటున్నారు.



రోడ్డుపక్కన పడేసిన చెత్త

లోక్ అదాలత్‌తో త్వరితగతిన పరిష్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వివాదాలు శాంతియుతంగా.. రాజీ మార్గంలో పరిష్కరించుకోవడమే లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యమని లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం లోక్ అదాలత్ సందర్భంగా న్యాయవాదులు, కక్షిదారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చే తీర్పులు అంతిమమైనవని, సివిల్ కోర్టులు ఇచ్చే డిక్రీలుగా పరిగణింపబడతాయని అన్నారు. లోక్ అదాలత్‌లో 17 సివిల్ కేసులు, 126 క్రిమినల్ కేసులు వెరశి 143 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వుండవల్లి గోపాలరావు, బీవీ నరసింహమూర్తి, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పిల్లి మురళీమోహన వెంకట రమణ, పలివెల సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఆర్.వి.జి సుబ్బారావు, ఆర్.ఆర్.కె.పి జానకి, ఏజీపీ లకాని పద్మకమలకుమారి, దొమ్మలపాటి సత్యనారాయణ, సూరంపూడి సత్యనారాయణ, సన్నపు బాలకృష్ణ, కుమార స్వామి, బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చిలిలో మెగా వైద్య శిబిరం

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉచ్చిలిలో మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన మదర్ మల్టీసెష్పాల్టీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, శ్రీరామదంత వైద్యశాల నిపుణులతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పావని, గురుకుమార్, పవన్, వై.రాంబాబు, పోతుమూడి శేషారత్నం పాల్గొన్నారు. శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు టి.సుబ్బరాజు ప్రారంభించారు.

టీఎన్ఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా సతీష్

రావులపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ కమిటీ నూతన అధ్యక్షుడిగా రాచకొండ సతీష్ నియమితులయ్యారు. ఈయన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండటంతో పదవి దక్కింది. తనను గుర్తించి పదవిని అందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో 22 నుంచి రుద్రయాగం

రాయవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నవశక్తి సహిత సుబ్రహ్మణ్య పూర్వక శ్రీరుద్ర యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈనెల 22న అమ్మవారు శైలపుత్రి, 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంటా, 25న కుష్మాండ, 26న స్కందమాత, 27న కాత్యాయని, 28న కాళరాత్రి, 29న మహాగౌరి, 30న సిద్ధిదాత్ర, 1న వారాహి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులతో 29న సరస్వతి పూజ, 2వ తేదీన మహాపూర్ణాహుతి అనంతరం భద్రకాళి, వీరేశ్వరస్వామికి శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. వచ్చేనెల 4న అన్నసమారాధన జరుగుతుందని ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పేర్కొన్నారు.